# తొలి ఐవిఎఫ్ బేబీకి నేడు 47 ఏండ్లు !

## (25 జూలై "ప్రపంచ ఐవిఎఫ్ (లేదా ఎంబ్రియాలజిస్ట్) దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచంలోని తొలి ఐవిఎఫ్ బేబీకి నేడు 47 ఏండ్లు పూర్తి అవుతున్నాయి. 25 జూలై 1978న ఇంగ్లాండ్‌లో ప్రపంచంలోనే తొలి 'ఐవిఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) బేబీ' అయిన "లూయిస్ బ్రౌన్" పుట్టి, సంతానలేమి సమస్యలు అనుభవిస్తున్న దంపతులకు ఒక నూతన శాస్త్రీయ ప్రక్రియకు ద్వారాలు తెరిచింది. నోబెల్ బహుమతి గ్రహీత "డా: రాబర్ట్ ఎడ్వర్డ్స్‌తో కలిసి "డా: ప్యాట్రిక్ స్టెప్‌టో" అను శాస్త్రవేత్త ఈ వినూత్న సంతాన సాఫల్య ఐవిఎఫ్ అనబడే మార్గాన్ని కనుగొనడం జరిగింది. ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం వేదికగా ఈ వినుత్న సంతాన సాఫల్య ప్రక్రియను కనుగొన్న ఎంబ్రియాలజిస్టులను (పిండ శాస్త్రవేత్తలు) గుర్తు చేసుకోవడం, ఇదే వైద్య విధానాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ, సంతానలేమి సమస్యకు తగిన పరిష్కారాలు చూపుతున్న ఎంబ్రియాలజిస్ట్ వైద్యులను సన్మానించుకోవడంతో పాటు ఈ సరి కొత్త పునరుత్పత్తి వైద్య సేవలను ప్రశంసించడం జరుగుతుంది. 2025 ప్రపంచ ఐవిఎఫ్ దినం ఇతివృత్తంగా "సైన్స్ ఆఫ్ లేఫ్, ఎథిక్స్, ఇన్నొవేషన్, అండ్ హోప్" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది.

### ఐవిఎఫ్ అనగా ఏమిటి ?

'ఐవిఎఫ్' అనగా 'ఇన్ విట్రో ఫర్టిలైజేషన్' అని అర్థం. 'ఇన్ విట్రో' అనగా 'ఒక గ్లాసులో' అని లేదా 'శరీరం బయట' లేదా 'ప్రయోగశాల'లో అని అర్థం చేసుకోవాలి. 'ఫర్టిలైజేషన్' అనగా 'ఫలదీకరణం' అని అర్థం. సాధారణంగా స్త్రీ గర్భంలోని ఎగ్స్ లేదా ఓవరీస్ (అండాశయం)తో పురుషుడి శుక్ర కణాలు లేదా స్పెర్మ్ కలిసి ఫరదీకరణం చెంది పిండం లేదా ఎంబ్రియో ఏర్పడడం వల్ల మహిళ గర్భధారణ జరుగుతుంది. స్త్రీ గర్భంలో జరగాల్సిన ఈ ఫలదీకరణాన్ని శరీరం వెలుపల ప్రయోగశాలలో చేయడాన్ని ఐవిఎఫ్ సంతాన సాఫల్య ప్రయోగ ప్రక్రియ అంటాం.

### ఎంబ్రియాలజిస్టుల పాత్ర:

ఎంబ్రియాలజిస్టులు అను శాస్త్రవేత్తలు సంతాన సాఫల్యం కోరుకునే దంపతులకు చెందిన ఆరోగ్యకరమైన శుక్ర కణాలు, ఎగ్స్ లేదా అండాశయం, ఎంబ్రియో లేదా పిండాలను జాగ్రత్తగా చూసుకుంటూ ఐవిఎఫ్ విధానంలో పిల్లల్ని కనడానికి ఆయా దంపతులకు వైద్య సలహాలు ఇవ్వడం జురుగుతుంది. నిజానికి ఎంబ్రియాలజిస్టులు తమ చేతుల్లో మరో శిశువుకు ప్రాణం పోస్తూ, ఐవిఎఫ్ ప్రక్రియలో సంతానం కలగడానికి కొత్త మార్గాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు.

### ప్రపంచవ్యాప్తంగా 8 మిలియన్ల ఐవిఎఫ్ శిశువుల జననం:

ఒకనాడు కొద్ది మంది దంపతులకు పలు కారణాల వల్ల సంతాన భాగ్యం ఉండేది కాదు. అలా సంతానం పొందలేని మహిళల్ని పౌర సమాజం 'గొడ్రాలా' అంటూ చిన్న చూపు చూసే ఆచారం నేటికీ గ్రామీణంలో కొనసాగుతున్నది. స్త్రీలతో పురుషుల పలు రుగ్మతల వల్ల సంతానలేమి సమస్యలు వస్తున్నప్పటికీ సంతానలేమి సమస్య స్త్రీ వల్ల మాత్రమే జరుగుతుందనే మూఢాచారం నేటికీ వాడవాడల్లో కనిపిస్తున్నది.

25 జూలై 1978న ప్రారంభమైన ఐవిఎఫ్ ప్రక్రియ నేడు విశ్వవ్యాప్తంగా అభాగ్య దంపతుల పాలిట వరంగా మారి, నేటి వరకు దాదాపు 8 మిలియన్ల శిశువుల జననాలకు కారణంగా సగర్వంగా నిలుస్తున్నది.

సగటున ప్రతి ఆరుగురు దంపతుల్లో ఒక్కరికి సంతానాలేమి సమస్య బయట పడుతున్నది. సంతానం లేని దంపతుల వేదన వర్ణనాతీతం. సాధారణ పద్ధతుల్లో సంతానం కలగని దంపతులను ఎంపిక చేసుకొని వ్యంధ్యత్వం లేదా ఇన్‌ఫెర్టిలిటీ సమస్యలకు పలు మార్గాల్లో చికిత్సలు చేస్తూ వారి అంగీకారం మేరకు ఐవిఎఫ్ పద్ధతిలో ప్రయోగశాలలో ఫలదీకరణ ప్రక్రియను పూర్తి చేసి స్త్రీ గర్భంలోకి పిండాన్ని లేదా ఎంబ్రియోను చేర్చి, నవమాసాలు మోసిన తల్లి శిశువుకు జన్మను ఇస్తూ, ఆ కుటుంబంలోశాశ్వత సంతోష తోరణాలను కడుతుంది.

### వ్యంధ్యత్వం, సంతానలేమి లేదా ఇన్‌ఫెర్టిలిటీకి కారణాలు :

పురుషుల్లో తక్కువ శుక్ర కణాలు (స్పెర్మ్ కౌంట్) ఉండడం, శుక్ర కణాల మెబిలిటీ తక్కువగా ఉండడం, వెరికోసిల్, హార్మోన్ల అసమతుల్యత లేదా ఇంబ్యాలెన్స్, జన్యు రుగ్మతల వల్ల సంతానలేమిమసమస్య రావచ్చు. స్త్రీల్లో పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఓఎస్), ఎండోమెట్రియాసిస్, గొట్టంలా మూసుకుపోవడం లేదా బ్లాక్డ్ ట్యూబ్స్, ఒవ్యులేషన్ రుగ్మతలు, వయస్సు, హార్మోనల్ సమస్యల వల్ల మహిళలకు సంతానం కలగక పోవచ్చు. కొన్ని సందర్భాల్లో దంపతులు ఇద్దరి జీవనశైలి కూడా సంతానలేమి సమస్యలకు దారితీయవచ్చు. పొగ తాగడం, ఆల్కహాల్ అతిగా సేవించడం, స్థూలకాయం, మానసిక ఒత్తిడి, పర్యావరణ టాక్సిన్స్‌కు గురి కావడం లాంటివి కూడా సంతానం కలగక పోవడానికి కారణాలుగా నిలుస్తున్నాయి.

### ఇన్‌ఫర్టిలిటీ, సంతానలేమి లేదా వంధ్యత్వ నివారణకు మార్గాలు:

దంపతుల మానసిక ఒత్తిడిని తగ్గించే టెక్నిక్స్ పాటించడం, తగిన వయస్సులో సంతానం కనడం, పునరుత్పత్తి సమస్యలను ముందస్తు గుర్తించడం, ఆరోగ్యకర పోషకాహారం తీసుకోవడం, బరువును నియంత్రించు కోవడం, పొగ తాగడాన్ని మానుకోవడం, పరిమితుల్లో ఆల్కహాల్‌ను సేవించడం లాంటి ముందు జాగ్రత్తలతో సంతానలేమి సమస్యల నుంచి బయట పడవచ్చు.

ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం వేదికగా స్వచ్ఛంద సంస్థలు, సంతానోత్పత్తి పట్ల అవగాహనలు పెంచడం, ప్రజారోగ్య వ్యవస్థలు సమయానుకూలంగా సంతానోత్పత్తి పట్ల అవగాహన కల్పించడం,

ఉచిత సంతానోత్పత్తి శిభిరాలు ఏర్పాటు చేయడం, వర్చువల్ వర్క్‌షాప్స్ నిర్వహించడం, సంతాన సాఫల్య వైద్యులను సన్మానించుకోవడం, ఐవిఎఫ్ చుట్టు అల్లుకొని ఉన్న అపోహలను తొలగించడం లాంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రయత్నాలు జరగాలి. ప్రతి జంట సంతానాన్ని పొంది ఇల్లంతా సంబరాల స్వర్గంగా మారాలి.

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# క్విజ్ పోటీల కోసం సన్నాహాలు

న్యూఢిల్లీ, జులై 24:గత ఎడిషన్లలో అద్భుత విజయం సాధించిన ది ఇండియన్ నేవీ థింక్ 2025 జాతీయ స్థాయి క్విజ్ పోటీ తిరిగి ప్రారంభం కానుంది. నాల్గో సంవత్సరం నిర్వహించనున్న ఈ క్విజ్ పోటీలను యువతకు, భవిష్యత్ నాయకులకు భారత నావికాదళాన్ని గురించి సమగ్రమైన అవగాహన కలిగించే లక్ష్యంతో రూపొందించారు. మేధో వృద్ధి, భారత విశిష్ట సముద్ర వారసత్వాన్ని గురించి అవగాహనను పెంపొందించడం లక్ష్యంగా గల ఈ ప్రధాన కార్యక్రమం సాధారణ పరిజ్ఞానానికి మించిన పరీక్ష.

ఈ సంవత్సరం 'మహాసాగర్' ఇతివృత్తంతో థింక్ 2025 పోటీలు జరగనున్నాయి. ఈ ఇతివృత్తం పురాతన లోథాల్ రేవుల నుంచి భారత సముద్ర ప్రయాణాన్ని, ఇండో-పసిఫిక్‌లో పెరుగుతున్న దాని ఉనికినీ ప్రదర్శిస్తుంది. అదే సమయంలో మహాసముద్రాల ప్రాముఖ్యతను, అన్వేషణ-ఆవిష్కరణల స్ఫూర్తిని స్పష్టం చేస్తుంది. 2025ను 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ దార్శనికతలోనూ ఈ ఇతివృత్తం ప్రతిధ్వనిస్తుంది.

దేశవ్యాప్తంగా 9 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. ఈ క్విజ్ హైబ్రిడ్ ఫార్మాట్‌ను అనుసరిస్తుంది. పాల్గొనేవారి సమగ్ర మూల్యాంకనాన్ని నిర్ధారిస్తూ నాలుగు దశల్లో జరుగుతుంది. మొదటి మూడు దశలు వడపోతకు ఉద్దేశించారు. ఇవి ఆన్‌లైన్ ద్వారా జరుగుతాయి. అనంతరం ఆన్‌లైన్ ప్రోక్టర్డ్ మోడ్ ద్వారా జోనల్ ఎంపిక ఉంటుంది. న్యాయబద్ధంగా, నిమగ్నయ్యేదిగా.. పరిజ్ఞాన వేగం, స్థాయి రెండింటినీ పరీక్షించేలా ఈ క్విజ్‌ను రూపొందించారు.

జోనల్స్ నుంచి టాప్ 16 జట్లు సెమీ ఫైనల్స్‌కు వెళ్తాయి. సెమీ ఫైనల్ పోటీల విజేతలు గ్రాండ్ ఫినాలేలో ప్రతిష్ఠాత్మక థింక్-25 ట్రోఫీ కోసం పోటీపడతాయి. సెమీఫైనల్, గ్రాండ్ ఫినాలే పోటీలు కేరళలోని ఎజిమలలో గల భారత నౌకాదళ అకాడమీ వేదికగా ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతాయి.

ముఖ్యమైన తేదీల వివరాలు:- రిజిస్ట్రేషన్స్ ముగింపు: 2025 ఆగస్టు 31, ఆన్‌లైన్ ఎలిమినేషన్ రౌండ్ 1: 2025 సెప్టెంబరు 08, 09, 10, ఆన్‌లైన్ ఎలిమినేషన్ రౌండ్ 2: 2025 సెప్టెంబరు 16, 17, ఆన్‌లైన్ ఎలిమినేషన్ రౌండ్ 3: 2025 సెప్టెంబరు 23, 24, జోనల్ ఎంపిక రౌండ్: 2025 అక్టోబరు 13, 14, సెమీఫైనల్స్: 2025 నవంబరు 13 గ్రాండ్ ఫినాలే: 2025 నవంబరు 14పాఠశాలలు నమోదు చేసుకోవడానికి, కార్యక్రమం గురించిన మరింత సమాచారం కోసం www[dot]indiannavythinq[dot]in ను సందర్శించవచ్చు.

# జనాభా లెక్కలు- 2027

న్యూఢిల్లీ, జులై 24జన గణనను చేపట్టాలన్న అభిమతాన్ని ప్రభుత్వం గత నెల 16న గెజిట్ నోటిఫికేషన్‌లో తెలియజేయడంతో జనాభా లెక్కలు-2027ను ('సెన్సస్ 2027') సిద్ధం చేసే ప్రక్రియ మొదలైంది. ఈ విషయంలో, ఒక సమావేశాన్ని ఈ నెల 3, 4 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈ సమావేశంలో సెన్సస్ కార్యకలాపాల డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో పాటు భారత రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

జనాభా లెక్కల సేకరణకు అనుసరించాల్సిన మార్గసూచీ, సంబంధిత కార్యకలాపాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. చర్చించిన ఇతర అంశాల్లో.. పాలన విభాగాల రూపురేఖలపై తుది నిర్ణయం, మొబైల్ అప్లికేషన్లను ఉపయోగించి సమాచారాన్ని సేకరించడం, సెన్సస్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీఎంఎంఎస్) పోర్టల్ ద్వారా జనగణన సంబంధిత కార్యకలాపాల నిర్వహణ, పర్యవేక్షణ, జనాభా లెక్కల సేకరణ కార్యక్రమంలో పాల్గొనే అధికారులకు శిక్షణనివ్వడం, సెల్ఫ్-ఎన్యూమరేషన్, తదితరాలు ఉన్నాయి.

ఈ సమాచారాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ నిత్యానంద్ రాయ్ లోక్ సభ లో ఒక ప్రశ్నకు ఇచ్చిన ఒక లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు.

# రామాయణ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించే "కణ్-కణ్ మే రామ్"

న్యూఢిల్లీ, జులై 24:దేశంలోని రామాయణ సంబంధిత సంప్రదాయాలు, కథనాల సాంస్కృతిక గొప్పతనాన్ని, వైవిధ్యాన్ని ప్రదర్శించే "కణ్-కణ్ మే రామ్" అనే డాక్యుమెంటరీ చిత్రాన్ని భారత జాతీయ కళలు-సాంస్కృతిక వారసత్వ ట్రస్టు (ఐఎన్‌టీఏసీహెచ్) రేపు విడుదల చేయనుంది. సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ అధికారికంగా ఈ చిత్ర ప్రదర్శనను ప్రారంభించనున్నారు.

రేపు మధ్యాహ్నం 12:00 గంటలకు న్యూఢిల్లీలోని ఐఎన్‌టీఏసీహెచ్, 71, లోఢీ ఎస్టేట్‌లోని మల్టీ-పర్పస్ హాల్‌లో ఈ చిత్ర విడుదల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశంలో రామాయణ కథను ప్రదర్శించడం కోసం వాడుకలో ఉన్న సంప్రదాయిక ప్రదర్శనలు, నృత్యం-నాటకాలు, తోలుబొమ్మలాట వంటి వివిధ ప్రదర్శన రూపాలను ఈ డాక్యుమెంటరీ ప్రదర్శిస్తుంది. కర్ణాటక యక్షగానం, ఉప్పినికుద్రు తోలుబొమ్మ లాట.. ఒడిశా లంకా పోడి యాత్ర, రావణ ఛాయ.. అస్సాం సత్రియా సంప్రదాయాలు, ఛత్తీస్‌గఢ్ మేవాటీ భాపాంగ్ ప్రదర్శన, రామనామి సమాజ్ వంటి ముఖ్యమైన సంప్రదాయిక ప్రదర్శనలు ఈ చిత్రంలో ఉంటాయి.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీరాముని సర్వవ్యాప్త సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఉనికిని ఈ డాక్యుమెంటరీ కళ్లకు కడుతుంది. మతపరమైన హద్దులను అధిగమించిన ఆయన కథలు, బోధనలను వివరిస్తుంది. ఈ చిత్ర ప్రధాన సందేశం "కణ్-కణ్ మే రామ్" శ్రీరాముని దివ్య రూపాన్ని సాక్షాత్కరింపజేస్తూ, ఆయన శాశ్వతత్వ సామూహిక స్పృహతో మానవాళిని అనుసంధానిస్తుంది.

ఈ అద్భుత సందర్భంలో.. సాంస్కృతిక, వారసత్వ ఔత్సాహికులు, పండితులు, సాధారణ ప్రజలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించడాన్ని ఐఎన్‌టీఏసీహెచ్ గౌరవంగా భావిస్తోంది. భారతీయ ప్రదర్శన కళల ద్వారా రామాయణ సాంస్కృతిక వైవిధ్యాన్ని, శాశ్వత వారసత్వాన్ని ప్రదర్శించే గొప్ప అవకాశంగా ఈ కార్యక్రమం నిలుస్తుంది.

# ఏఐ ఆధారిత బహుభాషా పరిష్కారాల అన్వేషణలో భాగస్వామ్యాన్ని మరింతగా పెంచేందుకు 'వేవ్ఎక్స్ స్టార్టప్ యాక్సిలరేటర్' కింద 'భాషాసేతు' పోటీ గడువు జూలై 30 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, జులై 24డిజిటల్ పరిపాలన విధానాల్లో భారత్ ముందంజ వేస్తున్నకొద్దీ, పౌరుల మాతృభాషలో ప్రత్యక్ష సమాచార ఆదానప్రదానం అత్యంత కీలకం. ఇది మరింత భారీ స్థాయిలో, సత్వరం విస్తరించేలా భాషా వ్యత్యాసాల తగ్గింపు, సమగ్ర-చివరి అంచెదాకా సమాచార ప్రదానం కోసం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిష్కారాల అన్వేషణ అవశ్యం.

దేశంలో భాషా వైవిధ్యం దిశగా 'ఏఐ' సామర్థ్యం సద్వినియోగానికి వీలుగా 'వేవ్ఎక్స్ స్టార్టప్ యాక్సిలరేటర్' కింద 'భాషా సేతు' పోటీలో భాగంగా నమూనా పరిష్కార ఎంట్రీల సమర్పణకు గడువును సమాచార-ప్రసార మంత్రిత్వశాఖ 2025 జూలై 30దాకా పొడిగించింది.

"భాషా సేతు రియల్-టైమ్ లాంగ్వేజ్ టెక్ ఫర్ భారత్" ఇతివృత్తంగా అంకుర సంస్థల స్థాయిలో ఈ పోటీ ఉంటుంది. ఇందులో భాగంగా ఏవైనా 12 భారతీయ భాషలలో ప్రత్యక్ష అనువాదం, లిప్యంతరీకరణ, గళ స్థానికీకరణ లక్ష్యంగా 'ఏఐ ఆధారిత ఉపకరణాల రూపకల్పన నమూనాలను రూపొందించాల్సి ఉంటుంది. ఈ పోటీలో వర్ధమాన అంకుర సంస్థలు, ఆవిష్కర్తలు తమ నమూనాలను మరింత మెరుగుపరిచేందుకు అనువుగా గడువు పొడిగింపు ద్వారా తగిన సమయమిచ్చింది.

భాషా సేతు ఛాలెంజ్

భాషా సేతు ఛాలెంజ్ 2025 జూన్ 30న ప్రారంభం కాగా, దేశవ్యాప్తంగా ఆరంభ దశలోని అంకుర సంస్థలు, సాంకేతికతల రూపకర్తలలో ఆసక్తి గణనీయ స్థాయిలో పెరిగింది. ఈ పోటీ సార్వజనీన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమేగాక ఓపెన్ సోర్స్ లేదా స్వల్ప వ్యయంతో లభించే 'ఏఐ' సాంకేతికతల వినియోగానికి చేయూతనిస్తుంది. అదే సమయంలో అందుబాటు, సౌలభ్యం చేయగల స్వీయ నమూనాలను కూడా స్వాగతిస్తారు.

ఆసక్తిగల పోటీదారులు వేవ్ఎక్స్ అధికార పోర్టల్ ప్టబిబిజూబ:// లిజీలవలీ.లిజీలవబఎజీళిజీజీతీ.ఇనీఏ ద్వారా తమ నమూనాలతో నమోదు చేసుకోవచ్చు.

వేవ్ఎక్స్ గురించి

'వేవ్ఎక్స్' అన్నది 'వేవ్స్' కార్యక్రమం కింద సమాచార-ప్రసార మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక అంకుర సంస్థల సంవర్ధక వేదిక (స్టార్టప్ యాక్సిలరేటర్). మీడియా, వినోదం, భాషా సాంకేతికతలలో ఆవిష్కరణల పెంపు దీని లక్ష్యం. ముంబయిలో నిర్వహించిన 'వేవ్స్-2025'లో భాగంగా పెట్టుబడిదారులు, ప్రభుత్వ సంస్థలు, సాంకేతిక అగ్రగామి సంస్థల ప్రతినిధుల సమక్షంలో 30కి పైగా అంకుర సంస్థలు తమ ప్రతిభను ప్రదర్శించాయి. ఆ తర్వాత కూడా 'హ్యాకథాన్, మెంటార్‌షిప్, నేషనల్ ప్లాట్‌ఫామ్ ఇంటిగ్రేషన్' తదితరాల ద్వారా తదుపరి తరం ఆవిష్కర్తలకు 'వేవ్ఎక్స్' సాధికారత కల్పిస్తూనే ఉంది.

ప్రస్తుతం 'వేవ్ఎక్స్' కింద భాషా సేతు (ఏఐ ఆధారిత భాషానువాదం), 'కళా సేతు' (ఏఐ ఆధారిత సారాంశ సృష్టి) పేరిట రెండు రకాల పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ రెండింటిలో పాల్గొనే ఔత్సాహికుల కోసం పోటీ గడువును 2025 జూలై 30గా నిర్ణయించారు.

# ఆడపిల్లలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు

**-జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్ .**
**-కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి విచారణ.**
**-విచారణ నివేదిక ఆధారంగా చర్యలు.**
**-నారాయణఖేడ్ బీసీ బాలికల కళాశాల వసతిగృహం వార్డెన్ కె. శారద సస్పెన్షన్.**
**-వార్డెన్ కుమారుడు అరెస్ట్, ఫోక్సో చట్టం కింద కేసు నమోదు.**
**-వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఔట్సోర్సింగ్ సిబ్బంది విధుల నుండి తొలగింపు.**

సంగారెడ్డి జూలై 24 (నేటి నిజం ప్రతినిధి)సంక్షేమ వసతి గృహాలు రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో , ఇతర విద్యాసంస్థలలో చదివే ఆడపిల్లలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్ హెచ్చరించారు. నారాయణ ఖేడ్ బిసి బాలికల కళాశాల వసతి గృహంలో వార్డెన్ కె.శారద, ఆమె కుమారుడు వసతి గృహంలోని విద్యార్థినులను వేధిస్తున్నట్లు వసతి గృహంలో ఉండే విద్యార్థినిలు నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం తో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్ ను ఈ సంఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో వారి ఆదేశాల మేరకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి వసతి గృహం ను తనిఖీ చేసి విచారణ జరిపినట్లు తెలిపారు. విచారణ నివేదిక ఆధారంగా అక్కడ పనిచేస్తున్న వార్డెన్ కె శారద ను సస్పెన్షన్ చేయడంతో పాటు ఔట్సోర్సింగ్ సిబ్బంది ఇద్దరిని విధులనుండి తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో వసతి గృహం సంక్షేమ అధికారిని సస్పెన్షన్ చేయడంతో పాటు ఔట్సోర్సింగ్ సిబ్బందిని ఇద్దరినీ తొలగించి సంక్షేమ అధికారి శారద కుమారుడు ని ఫోక్సో కేసులో అరెస్టు చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ బుక్ చేసినట్లు బీసీ సంక్షేమ అధికారి జగదీష్ తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే బాలికలను ఎవరైనా వేధిస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. బాలికలు ఎలాంటి సమస్యలు ఉన్న ధైర్యంగా ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. బాలికల భద్రత విషయంలో విశ్వాసంతో ఉండాలని ప్రభుత్వం దృష్టిలో మహిళ బాలికల సంరక్షణకు తొలి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు.ఇలాంటి సంఘటనలు జిల్లాలో పునరావృతం కాకుండా ఆయా సంక్షేమ వసతి గృహాల సంక్షేమ అధికారులు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# సంగారెడ్డిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు.



సంగారెడ్డి జూలై 24(నేటి నిజం ప్రతినిధి)సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రివర్యులు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు జరిగాయి.

కేటీఆర్ జన్మదిన సందర్భంగా సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

అనంతరం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పార్టీ శ్రేణులతో కలసి కేక్ కట్ చేసి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకొని రాష్ట్రానికి మరిన్ని సేవలు చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం మాజీ సి డి సి చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, డా.శ్రీహరి, చింత గోపాల్, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, మాజీ జడ్పిటీసీ కొండల్ రెడ్డి, పాండురంగం, మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, విఠల్, ఆంజనేయులు, వీరేశం, గోవర్ధన్ రెడ్డి, రషీద్, మజీద్, శ్రవణ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ లు , పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# మాజీ మంత్రి మల్లారెడ్డి ఇంట్లో ఐటీ సోదాలు..

హైదరాబాద్, జులై 24: తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి మల్లారెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించారు ఐటీ అధికారులు ఇంజనీరింగ్, మెడికల్ సీట్ల విషయంలో స్టూడెంట్స్ నుంచి భారీగా ఫీజులు వసూలు చేశారన్న ఆరోపణలున్న క్రమంలో.. గురువారం ( జులై 24 ) మల్లారెడ్డి ఇంట్లో సోదాలు చేపట్టారు అధికారులు. స్టూడెంట్స్ నుంచి వసూలు చేసిన సొమ్మును ఆదాయ పన్నులో చేర్చడంలో హెచ్చుతగ్గులు గుర్తించినట్లు తెలిపారు ఐటీ అధికారులు.

మల్లారెడ్డి ఇంటితో పాటు ప్రీతిరెడ్డి , భద్రరెడ్డి ఇంట్లో కూడా సోదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. సోదాలకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. మాజీ మంత్రి మల్లారెడ్డి ఇంటిపై ఐటీ సోదాలు కొత్త కాదు గతంలో కూడా మెడికల్ కాలేజీ సీట్ల అంశం లో ఐటీ, ఈడీ సోదాలు జరిగాయి. మల్లారెడ్డి ఇల్లు, యూనివర్సిటీ, మల్లారెడ్డి కాలేజీల్లో పలుమార్లు ఐటీ సోదాలు నిర్వహించారు అధికారులు.

# మెదక్‌లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు..

**-కేక్ కట్ చేసిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి**
**-సంబరాలు చేసుకున్న నాయకులు**




మెదక్, జులై 24:బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం మెదక్ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు, గులాబి శ్రేణులతో కలిసి పద్మాదేవేందర్ రెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు కేక్ తినిపించుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈసందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం.పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, కేటీఆర్ నిండు నూరేళ్లు ఆయురా రోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ఆ భగవంతుడు మరింత మనోధైర్యాన్ని ఇచ్చి గట్టిగా పోరాడే శక్తిని ఇవ్వాలన్నారు.

గత 10 సంవత్సరాల్లో బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, ఐటి, పురపాలక సంఘం మంత్రిగా కేటీఆర్ ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. పలు శాఖల మంత్రిగా ఉండి ఆ పదవికి వన్నె తెచ్చారన్నారు. తెలంగాణ ను ప్రగతి పథంలో ముందుండి నడిపించారన్నారు. తెలంగాణ ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాటం చేస్తూ ఉన్నాడని, ప్రభుత్వంతో ప్రజల కోసం పోరాటం చేస్తున్న కేటీఆర్ కు భగవంతుడు మరింత శక్తిని ఇవ్వాలని కోరారు. రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రానికి మరెన్నో సేవలు చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, పిఎసిఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు,మాజీ కౌన్సిలర్లు జయరాజ్, ఆర్ కె శ్రీనివాస్, మాయ మల్లేశం, చంద్రకళ, విజయలక్ష్మి, న్యాయవాది జీవన్రావు, మెదక్, హవెలిఘనపూర్, చిన్న శంకరంపేట మండల పార్టీ అధ్యక్షులు యం. అంజగౌడ్, సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, పట్లోరి రాజు, మెదక్ మండల రైతు బంధు మాజీ అధ్యక్షులు కిష్టయ్య నియోజకవర్గంలోని మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పట్టణ, మండల నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలు ఏమాయే.. ప్రశ్నించిన ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్, జులై 24: గరీబోళ్ల ఇళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరు దున్నపోతు మీద వర్షం పడ్డట్టు ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ధ్వజమెత్తారు. అసెంబ్లీ సాక్షిగా మంత్రి పొంగులేటి ఇచ్చిన హామీ ఏమాయే. సమీక్షలు సమావేశాలకే పరిమితమవుతారా అని ప్రశ్నించారు. గతంలో అధికారులతో సమీక్షలు నిర్వహించి గత దసరా పండుగకే ఇస్తామని మాయమాటలు చెప్పిండ్రు.. మళ్లీ దసరా వచ్చిన ఇప్పటి వరకు పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అర్బన్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

అదేవిధంగా నగరంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి పంపిణీ చేయాలని తెలిపారు. వచ్చే దీపావళి పండుగ వరకు నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ లు పంపిణీ చేయనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరాహార దీక్షలు చేపడుతామని ప్రభుత్వానికి అర్బన్ ఎమ్మెల్యే డెడ్ లైన్ ప్రకటించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ మాట్లాడారు. నగరంలో నిర్మించిన డబుల్ బెడ్ రూ మ్ ఇండ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి దున్నపోతు మీద వర్షం పడ్డట్టు ఉందని ఏద్దేవా చేశారు. ఇళ్లు ఇస్తే రెండో విడతలో జాగా లేని అర్హులకు ప్రభుత్వం కట్టించి ఇళ్లు ఇవ్వాలి. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రధాని ఫోటో ఉండాలి..

మా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద ఇళ్లు ఇస్తోంది. కేంద్రం వాటా కలిపి ఇస్తున్న ఇండ్లపై ప్రధాని పేరు, ఫోటో ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, న్యాలమ్ రాజు, మాజీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాలు ఏడాదిలో 60 రోజులు జరగాలి : స్పీకర్ అయ్యన్న పాత్రుడు

తిరుపతి, జులై 24:ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏడాది లో 60 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వాహించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. లోక్ సభ స్పీకర్ సూచనల మేరకు వచ్చే సెప్టెంబర్ 14, 15వ తేదీలలో తిరుపతిలో నిర్వహించ తలపెట్టిన జాతీయ స్థాయిలో పార్లమెంట్, అసెంబ్లీలలోని మహిళా సాధికారిత కమిటీల సభ్యుల సమావేశంలో పాల్గొనడానికి వచ్చిడానికి వచ్చిన అయ్యన్న పాత్రుడు, సమావేశం అనంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.

ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన దేశంలోని 31 రాష్ట్రాల అసెంబ్లీలతో పాటు, పార్లమెంట్ కు చెందిన మహిళా సాధికార కమిటీల సభ్యులు ఆ సమావేశానికి వస్తారని చెప్పారు.

లోక్ సభ స్పీకర్ కోరిక మేరకు ఆ సమావేశాన్ని తిరుపతి లో నిర్వహించ తలపెట్టామన్నారు.. అసెంబ్లీ సమావేశాలు కొన్ని రోజులకు, చర్చలు కొన్ని గంటలకు పరిమితం కావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఒకప్పుడు ఉదయం నుంచి తెల్లవారు ఝాము వరకు అర్ధవంతంగా చర్చలతో జరిగేవని గుర్తు చేసారు.

కనీసం వారం రోజులు పాటు కాకుండా సంవత్సరానికి అసెంబ్లీ సమావేశాలు 60 రోజులు పాటు జరగాలని అయ్యన్నపాత్రుడు అన్నారు. అప్పుడే రాష్ట్రానికి సంబంధించిన సమస్యలు పరిష్కారం జరిగే అవకాశాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ఇటీవలి జాతీయ స్థాయి స్పీకర్ల సమావేశం లో ప్రస్తావించామని చెప్పారు.

వచ్చే సెప్టెంబర్ లో తిరుపతిలో జరిగే మహిళా సాధికారత సమావేశంలో ప్రతి రాష్ట్రం నుంచి ఐదారు మంది సభ్యులు హాజరు అవుతారని తెలిపారు.

వీరందరూ కూడా రెండు రోజులు వారి సమస్యల మీద సుదీర్ఘంగా చర్చించి ఆ రిపోర్టుని పార్లమెంట్, అసెంబ్లీ ద్వారా గాని చర్చించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశం అనంతరం కాన్ఫరెన్స్ కు హాజరైన వారు శ్రీకాళహస్తి దైవ దర్శనం, శ్రీసిటీ, శ్రీహరికోట వంటి ప్రదేశాలలో సందర్శించడం జరుగుతుందని తెలిపారు.

ఆ తర్వాత రఘురామ కృష్ణ రాజు మాట్లాడుతూ, మహిళా సంక్షేమంలో ముందుండే ఆంధ్రప్రదేశ్ లో తిరుపతి ఆ సమావేశానికి వేదిక కావడం సముచితంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ముందుగా జిల్లా కలెక్టరేట్ లో జరిగిన సన్నాహక ఏర్పాట్ల తొలి సమావేశం లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖల మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ సూర్యదేవర, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఓ ఎస్ డి, పెట్టన్న చౌదరి, టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, టిటిడి ఈ.ఓ. శ్యామల రావు, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొన్నారు.

# గుండ్లవాగు, జలగలంచ వాగుల ఉధృతిని పరిశీలించిన మంత్రి సీతక్క



ములుగు, జులై 24:: ములుగు జిల్లాలోని పసర తాడ్వాయి మధ్యలో ఉన్న జలగలంచ గుండ్లవాగు వరద ఉధృతిని ఇవాళ రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తం గా, అదేవిధంగా ములుగు జిల్లాలో భారీ వర్షాలు నిన్నటి నుండి కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మంత్రి సీతక్క ప్రజలకు సూచించారు.

జిల్లా అధికార యంత్రాంగం భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని, జిల్లా ప్రజలకు అందుబాటులో ములుగు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలకు ఏమైనా సందేహాలుంటే కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 కు కాల్ చేయాలని మంత్రి సీతక్క ప్రజలను కోరారు.

రైతులు ముఖ్యంగా విద్యుత్ షాక్ ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రతగా ఉండాలని, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, జాలరులు చేపల వేటకు వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను అధికారులు గుర్తించి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించే విధంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, కింది స్థాయి అధికారులతో మానిటరింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పల్లాడియం కార్బన్ దొంగతనాలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసిన సంగారెడ్డి జిల్లా పోలీసులు.

**-సంగారెడ్డి సిసిఎస్, ఐడిఏ బొల్లారం పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో సుమారు రూ: 1.52 కోట్లు విలువ గల 38 కిలోల పల్లాడియం కార్బన్ స్వాధీనం.**

**- ముగ్గురు నిందితుల అరెస్ట్, హ్యుందాయ్ క్రెటా కారు మరియు 5 సెల్‌ఫోన్లను స్వాధీనం.**

**--వివరాలు వెల్లడించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.**



సంగారెడ్డి జూలై 24 (నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ ఫార్మా కంపెనీలలో పల్లాడియం కార్బన్ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను సంగారెడ్డి సిసిఎస్, ఐడిఏ బొల్లారం పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో సుమారు రూ: 1.52 కోట్లు విలువ గల పల్లాడియం కార్బన్ స్వాధీనం చేసుకొని, 3- నిందితులను అరెస్ట్ చేశామన్నారు.

గత సంవత్సరం డిసెంబర్ మాసం లో రామ్సాక్స్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పల్లాడియం కార్బన్ దొంగతనం జరిగినట్లు ఫిర్యాది రాగా బొల్లారం పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం సిసిఎస్ సంగారెడ్డి, ఐడిఏ బొల్లారం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించడం జరిగింది. సాంకేతిక ఆధారంగా, నమ్మదగిన సమాచారం మేరకు గురువారం ఉదయం 6 గంటల సమయంలో, కాజిపల్లి చౌరస్తా, ఔటర్ రింగ్ రోడ్ సర్వీస్ వద్ద ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 38 కిలోల పల్లాడియం కార్బైన్, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

ప్రధాన నిందితుడు నేరస్థుడు సాంబశివుడు వివిధ ఫార్మా కంపెనీ లో పని చేయడం వలన అతనికి పల్లాడియం కార్బన్ యొక్క విలువ గురించి పూర్తి అవగాహన కలదు. దానిని ఆధారంగా చేసుకుని తప్పుడు మార్గంలో అక్రమంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో గతంలో అతను పూణేలో ఫార్మా కంపెనీలో పనిచేసేటప్పుడు అక్కడ అతనితో పని చేస్తున్నా ప్రసాద్ మరియు అన్మోల్ జగ్గే అలియాస్ రాజుతో పరిచయం చేసుకొని, ఫార్మా కంపెనీలో పల్లాడియం కార్బన్ ను దొంగతనం చేసి తీసుకురావలసిందిగా, దానిని అమ్మగా వచ్చిన డబ్బులను సమానంగా పంచుకుందాం అని చెప్పి, నేరస్తుడు సాంబశివుడు పూణేలో లో పని మానేసి తిరిగి హైదరాబాద్ వచ్చి పల్లాడియం కార్బన్ లభించే ఫార్మా కంపెనీల గురించి తెలుసుకుంటూ అక్కడ పనిచేస్తున్న స్టోర్ సిబ్బందికి డబ్బులు ఆశ చూపెట్టి అట్టి కంపెనీ యొక్క మెటీరియల్ గురించి పూర్తి సమాచారం తీసుకొని ప్రసాద్ టీం లేదా అన్మోల్ జాగడే టీంకు తెలియజేస్తుండే వాడు. ఈ కేసు చేధనలో కీలకంగా ఉన్న సిసిఎస్ ఇన్స్పెక్టర్ వి.శివకుమార్, ఇన్స్పెక్టర్ పి.రాము నాయుడు, ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి, ఐడిఏ బొల్లారం పోలీసు స్టేషన్, ఎస్ఐ శ్రీకాంత్ మరియు సిబ్బంది రేక్య, అన్వర్, శశిధర్, ప్రశాంత్, ఉదయ్ కిరణ్, సతీష్, వామ్ దాస్, మోహన్ లను ఎస్పీ అభినందించారు.

ఈ ప్రెస్ మీట్ నందు పటాన్‌చెరు డిఎస్పీ ప్రభాకర్, ఇన్స్పెక్టర్ వి.శివకుమార్ (సిసిఎస్), ఇన్స్పెక్టర్ పి. రాము నాయుడు (సిసిఎస్), ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి (ఎస్ హెచ్ ఓ ఐడిఏ బొల్లారం), ఎస్ఐ శ్రీకాంత్ (సిసిఎస్) మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీఎంల బదిలీల్లో గందరగోళం.. సీనియారిటీ కాదని బదిలీ

**-అందరి ముందే అవమానించారని కన్నీరు**

**-రాజకీయ బలమే అని పలువురి ఆరోపణ**

**-సీనియర్లను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్**

వరంగల్, జులై 24: వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న వివిధ మండలాల ఏపీఎంల బదిలీల కౌన్సిలింగ్ డీఆర్డీఏ కార్యాలయంలో జరిగింది. ఈ కౌన్సిలింగ్ జిల్లా అధికారి ఛాంబర్ లో జరగగా ఒకింత గందరగోళం చోటుచేసుకుంది. సీనియారిటీ లిస్ట్ ను పరిగణలోకి తీసుకోకుండా బదిలీలు చేశారని ఒకరు.. తమను అందరి ముందే అవమానించారని ఒకరు.. కంటతడి పెట్టారు. రాజకీయ బలం ఉన్నవారికి కార్యాలయ అధికారికి అనుయాయులుగా ఉన్నవారికి కోరుకున్న చోట కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదాహరణకు ఓ అధికారికి కార్యాలయంలో కావాల్సి ఉండగా.. నీకు టైపింగ్ వచ్చా అని అన్నట్లు సమాచారం.

# గొడవ ఆపే ప్రయత్నంలో..

జన్నారం, జులై 24: ఇంటి పక్క ప్రహరీ గోడ వ్యవహారంలో ఇరు వర్గాలు గొడవపడి, గొడవ ఆపడానికి మధ్యలో వచ్చిన వేరొకరిపై వారి ప్రతాపం చూపారు? ఫలితంగా, ఒక నిస్సహాయురాలైన 61 ఏండ్ల వృద్ధురాలు ప్రాణం పోగొట్టుకున్న ఉదంతమిది.

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని లింగయ్యపల్లి వాసి గొట్ల బుచ్చమ్మ(61) అదే గ్రామానికి చెందిన అయ్యోరు తిరుపతి, చంద్రమౌళిలు మంగళవారం రాత్రి ప్రహరీ గోడ వ్యవహారంలో గొడవ పడి నెట్టి వేయగా డ్రైనేజీలో పడి మృతి చెందినట్లు స్థానిక ఎస్సై గొల్లపల్లి అనూష బుధవారం తెలిపారు.

ఈ నెల 22 న రాత్రి గొట్ల గంగయ్య చిన్న కొడుకు తిరుపతి, అదే గ్రామానికి చెందిన అయ్యోరు సత్తయ్య, చంద్రమౌళిలు కర్రలతో ఒకరినొకరు కొట్టుకున్నారని, ఆ గొడవ ఆపడానికి వారిద్దరి మధ్యలోకి వెళ్లిన బుచ్చమ్మను సత్తయ్య, చంద్రమౌళిలు నెట్టివేయగా, ఆమె పక్కనే ఉన్న డ్రైనేజీలో పడి మృతి చెందిందన్నారు.

భార్య ఇంట్లో కనిపించక పోవడంతో వృద్ధురాలి భర్త, చుట్టు పక్కల బుధవారం ఉదయం వెతకగా, ఇంటి ముందున్న డ్రైనేజీలో పడి కనిపించిందని, తన భార్య మృతికి సత్తయ్య, చంద్రమౌళిలు కారణమని మృతురాలు భర్త గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు.

లింగయ్యపల్లి సంఘటన స్థలాన్ని లక్షెట్టి పేట సీఐ రమణమూర్తి, స్థానిక ఎస్సై గొల్లపల్లి అనూష సందర్శించి, విచారణ జరిపారు. ప్రహరీ గోడ వ్యవహారంలో లింగయ్యపల్లికి చెందిన అయ్యోరు సత్తన్న, చంద్రమౌళిలను అదే గ్రామానికి చెందిన గొట్ల తిరుపతి, రాజన్నలు మంగళవారం రాత్రి నానా బూతులు తిడుతూ, కర్రలతో దాడి చేసి కొట్టగా సత్తన్న, చంద్రమౌళిలకు తీవ్ర గాయాలై, మంచిర్యాలలోని ఓ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ కొట్లాటలో సత్తన్న తల పగిలి, చేయి ఎముక విరిగిందని, చంద్రమౌళి తల పగిలి, నడుముకు, భుజానికి బలమైన గాయాలైనట్లు సత్తన్న భార్య లావణ్య ఫిర్యాదు మేరకు గొట్ల తిరుపతి, రాజన్నలపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం తీవ్ర గాయాల గురైన ఆ బాధితులు ఇద్దరు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ చికిత్స పొందుతున్నారు.

# పిడుగుపాటుతో యువకుడి మృతి.. పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



ములుగు, జులై 24 : ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు గ్రామానికి చెందిన తోటపల్లి వేణు (20) పిడుగుపాటుకు గురై బుధవారం మృతిచెందాడు. వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ ఆధ్వర్యంలో పరామర్శించారు.

దహన సంస్కరణల నిమిత్తం ఐదువేల రూపాయలు అందించడమే గాక ప్రభుత్వం నుండి వచ్చే అన్ని అవకాశాలను అందించేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు.

అదేవిధంగా మృతిచెందిన వేణు తల్లిదండ్రులతో భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తో ఫోన్ లో మాట్లాడించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మృతిచెందిన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ తమ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో వాజేడు నాగారం మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, వాజేడు మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌరారపు కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు చెన్నం ఎల్లయ్య, నలగాసి రమేష్, అరికెల రఘుపతి, తిప్పనపల్లి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటులో ప్రశ్న: ఎస్సీ విద్యార్థులకు ఉపకార వేతనం

న్యూఢిల్లీ, జులై 24:దేశంలోని విద్యా సంస్థలు/కళాశాలల్లో ఉన్నత విద్యను అభ్యసించేలా షెడ్యూల్డు కులాలకు చెందిన విద్యార్థుల విద్యాప్రమాణాలను పెంపొందించడంలో.. పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ (పీఎంఎస్), ఉన్నతస్థాయి విద్యా పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులకు అందిస్తున్న ఆర్థిక సాయం, ఉపకార వేతనాలు విశేషంగా దోహదపడ్డాయి.

ఇది ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, షెడ్యూల్డు కులాలకు చెందిన విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందేలా దోహదపడింది. విద్యావకాశాలను మెరుగుపరచడం ద్వారా సామాజిక - ఆర్థిక ప్రగతిని పెంపొందించాయి. కెరీర్ అవకాశాలను పెంచడంతోపాటు ఎస్సీ వర్గాల్లో ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని ఈ పథకాలు పరిష్కరించాయి.

గడచిన ఐదేళ్లలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ ద్వారా 2,22,31,139, ఉన్నత స్థాయి విద్యా పథకం కింద 20,340 ఎస్సీ విద్యార్థులకు ప్రయోజనం కలిగింది.

ఈ పథకాల కింద షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు ఐఐటీ, ఐఐఎంలు, ట్రిపుల్ ఐటీలు, ఏఐఐఎంఎస్‌లు, ఎన్ఐటీలు, ఎన్ఐఎఫ్‌టీలు, ఎన్ఐడీలు, ఐహెచ్ఎంలు, ఎన్ఎల్‌యూలు మొదలైన కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, సంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. తమతమ రంగాల్లో విశేషమైన విజయాలు సాధించారు.

రాజ్యసభలో ఓ ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి శ్రీ రాందాస్ అథవాలే ఈ సమాచారాన్ని అందించారు.

# మరింతగా విస్తరించిన డీడీ ఫ్రీ డిష్

న్యూఢిల్లీ, జులై 24'దూరదర్శన్ ఫ్రీ డిష్' అనేది ప్రసార భారతి ఉచిత ప్రసార (ఎఫ్‌టీఏ), డైరెక్ట్ టు హోమ్ (డీటీహెచ్) వేదిక. మారుమూల, సరిహద్దు ప్రాంతాలు, చేరుకోలేని ఇతర ప్రాంతాలు సహా దేశవ్యాప్తంగా దీని ప్రసారాలు విస్తరించి ఉన్నాయి.

డీడీ ఫ్రీ డిష్ ద్వారా వివిధ దూరదర్శన్ జాతీయ, ప్రాంతీయ చానళ్లలో వివిధ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలపై ప్రచారం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కొన్నేళ్లుగా దాని ప్రసార పరిధి క్రమంగా విస్తరిస్తోంది. సంబంధిత అంచనాల ప్రకారం.. 2024 నాటికి డీడీ ఫ్రీ డిష్ దేశవ్యాప్తంగా దాదాపు 4.9 కోట్ల గృహాలకు చేరుకుంది. 2018లో ఇది 3.3 కోట్లుగా ఉండగా, వీక్షకుల సంఖ్య విశేషంగా పెరుగుతుండడం గమనార్హం.

దూరదర్శన్ ఫ్రీ డిష్ లో దక్షిణ భారత భాషా ఛానళ్ల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం అనేక క్రియాశీల చర్యలు తీసుకుంది:-

ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని మెరుగుపరచడం కోసం.. డీడీ ఫ్రీ డిష్ వేదిక ఈ-వేలంలో దక్షిణ భారత భాషా ఛానళ్లకు స్లాట్లను రిజర్వ్ చేశారు (2025లో నిర్వహించారు).

దక్షిణ భారతదేశంలోని ప్రైవేటు రంగంలోని ప్రసార మాధ్యమాల భాగస్వామ్యాన్ని పెంచడం కోసం అర్హత నిబంధనలను సరళతరం చేశారు.

ఇటీవల నిర్వహించిన ఈ-వేలంలో తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ ఛానళ్లకు ప్రత్యేక స్లాట్లను కేటాయించారు.

మరో మూడు దక్షిణ భారత భాషలకు చెందిన ప్రైవేటు ఛానళ్లు టీవీ9 తెలుగు, ఆస్తా కన్నడ, ఆస్తా తెలుగు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి డీడీ ఫ్రీ డిష్‌లో అందుబాటులో ఉన్నాయి.

దూరదర్శన్ సొంత ప్రాంతీయ ఛానళ్లయిన డీడీ తమిళ, డీడీ సప్తగిరి, డీడీ చందన, డీడీ యాదగిరి, డీడీ మలయాళం కూడా ఇందులో ఉన్నాయి. ఈ ఛానళ్లను సాంకేతికంగా అభివృద్ధి చేసి, మరింత ప్రచారం ద్వారా విస్తృతంగా ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు కృషిచేస్తున్నారు.

ఇవి కాకుండా డీడీ ఫ్రీ డిష్ లో 27 ఎడ్యుకేషనల్ ఛానళ్లు ఉన్నాయి. అవి వివిధ దక్షిణ భారత భాషల్లో కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నాయి.

కేంద్ర సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈరోజు లోకసభలో ఈ సమాచారాన్ని అందించారు.

# జట్టు స్ఫూర్తితో ఏదైనా సాధించవచ్చు : జీఎం షాలెం రాజు




ఖమ్మం, జులై 24:జట్టు స్ఫూర్తితో ఏదైనా సాధించవచ్చని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు అన్నారు. కొత్తగూడెం ఏరియాలోని ఆర్సీఓఏ క్లబ్ నందు బుధవారం రాత్రి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (చిఖా ఒ ఉం) వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాలెం రాజు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కార్మికుల్లో టీమ్ స్పిరిట్ పెంపొందించేందుకు క్రీడలు ఎంతో దోహద పడుతాయన్నారు. ఈ టీమ్ స్పిరిట్‌తో బొగ్గు ఉత్పత్తి, రక్షణలో కూడా మెరుగుదల ఉందన్నారు. డెపార్ట్‌మెంటల్ క్రీడలను పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించినందుకు సంబంధిత అధికారులను అలాగే చిఖా ఒ ఉం సభ్యులను జీఎం అభినందించారు.

అనంతరం కోల్ ఇండియాలో బాడీ బిల్డింగ్ విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించి మిస్టర్ కోల్ ఇండియాగా ఎంపికైన ఎం.రామకృష్ణ, అసిస్టెంట్ చైర్మన్, జేవిఆర్ ఓసి.ఎ, అలాగే ఈ.సుష్మా రాణి, జూనియర్ అసిస్టెంట్, ఎస్టేట్ డిపార్ట్‌మెంట్ 100 మీటర్స్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ పోటీల్లో సిల్వర్ మెడల్స్ అలాగే 4100 రిలే పోటీల్లో కాంస్య మెడల్ కలిపి మొత్తం 4 మెడల్స్ సాధించినందుకు, అలాగే పబ్లిక్ సెక్టార్ నందు అథ్లెటిక్ విభాగంలో పాల్గొనందుకు పి.పవన్ కుమార్ ను శాలువాతో సత్కరించి చెక్కులను అంధించారు.

# ప్రశ్నిస్తే పగబట్టినట్టుగా అన్నీ వర్గాలపై ఆంక్షలు

**-మొన్న యూనివర్సిటీల్లో ఆందోళనలు నిషేధిస్తూ మెమో**

**-నేడు లైబ్రరీల్లో విద్యార్థులపై ఆంక్షలు**

**-ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెస్తున్నారని మండిపడ్డ హరీశ్‌రావు**

హైదరాబాద్ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రశ్నిస్తే పగబట్టినట్టుగా అన్నీ వర్గాలపై ఆంక్షలు విధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి నిత్యకృత్యంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మొన్న యూనివర్సిటీల్లో ఆందోళనలు నిషేధిస్తూ మెమో ఇచ్చారు. నేడు లైబ్రరీల్లో విద్యార్థులపై ఆంక్షలు విధిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య పాలన అనే ఏడో గ్యారంటీని మరచి ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెస్తున్నారని మండిపడ్డారు.గ్రంథాలయాలను రాజకీయ వేదికలుగా మార్చిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని హరీశ్‌రావు విమర్శించారు. ఇప్పుడు సుద్దపూస మాటలు, నీతులతో బోర్డులు పెట్టినంత మాత్రాన పాపపరిహారం కాదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రాజకీయం అంతా లైబ్రరీల చుట్టే జరిగిందని తెలిపారు. రాహుల్ గాంధీని సైతం లైబ్రరీకి తీసుకొచ్చి బూటకపు హామీలు ఇచ్చిన సంగతి మరిచిపోయారా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే అవి రాజకీయ వేదికలు కావు, గ్రంథాలయాలు అని గుర్తు వచ్చాయా అని నిలదీశారు.గ్రంథాలయాల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది అని హరీశ్‌రావు మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఏమైందని మీ నాయకుడిని విద్యార్థులు నిలదీసినందుకు, ఈరోజు గ్రంథాలయాల్లో నిషేధాజ్ఞలు ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒక విధంగా, అధికారం పక్షంలోకి రాగానే మరొక విధంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని తెలిపారు. మొత్తం తెలంగాణ సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా అని ప్రశ్నించారు.జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని.. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేశారని హరీశ్‌రావు మండిపడ్డారు.

# ఈస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులను కలిసిన శివసేన నేతలు



హైదరాబాద్ జూలై 24 (ఎక్స్ ప్రెస్స్ న్యూస్ );ఈస్ట్ జోన్ ట్రాఫిక్ డీసీపీ ,సెంట్రల్ జోన్ సంకురి శ్రీనివాస్ ,సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఏసీపీ అనుమల శ్రీనివాస్ మరియు కాచిగూడ సి ఐ శ్రీనివాస్ లను శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్ నేతృత్వం లో ప్రతినిధ్యుల బృందం బుదవారం మర్యాద పూర్వగా కలవడం జరిగింది ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కఠినంగా వ్యవహరించాలని మైనర్ పిల్లల కు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే మాత్రం వారిపై కేసులు బుక్ చేయాలని ఈ విషయంలో కఠినంగా ఉండాలని కోరారు.తద్వారా మైనర్ పిల్లలను రక్షించడం అవుతుంది మరియు కొంత మంది స్కూల్ వాహనాలు నడిపే డ్రైవర్లు ఉదయం పూటనే తాగుతున్నారు వారిపై కఠినంగా శిక్షించాలని స్కూల్ పిల్లల్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్నతాధి కారులపై ఉన్నదని సుదర్శన్ పేర్కొన్నారు. శ్యామ్ బోటు శ్రీనివాస్ గోపాల్ మదన్ రాజు తదితరులు పాల్గొన్నారు అధికారులకు శాలువాతో సత్కరించడం జరిగింది

# శ్రీశైల జలాశయానికి భారీగా వరద నీరు..

## -ఇన్‌ఫ్లో 91,812 క్యూసెక్కులు.. అవుట్ ఫ్లో 1,14,709 క్యూసెక్కులు

శ్రీశైలం జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రభావం కొనసాగుతున్నది. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి వరద వచ్చి డ్యామ్‌లో చేరుతున్నది. ప్రస్తుతం జలాశయానికి 91,812 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ఇక అవుట్ ఫ్లో 1,14,709 క్యూసెక్కులుగా నమోదైంది. ఒక స్పిల్‌వే గేట్ ఎత్తి 27,52 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20వేల క్యూసెక్కులు విడుదలవుతోంది. ఎడమ గట్టు, కుడిగట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. ఎడమగట్టు నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు నుంచి 31,870 క్యూసెక్కులు వరద దిగువకు వెళ్తున్నది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883.80 అడుగుల మేర నీరుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 208.72 టీఎంసీల మేర నిల్వ ఉందని అధికారులు తెలిపారు. అయితే, ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో వానలు దంచికొడుతున్నాయి. వర్షాలు ఇలాగే కొనసాగితే కృష్ణా నదికి వరద ఇంకా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# దక్షిణ భారతదేశంపై తమ ఆధిపత్యాన్ని చెలాయించడం కోసమే హిందీ భాష..

**-ఉత్తరాదిలో నివసించే ఎవరైనా తెలుగులో మాట్లాడతారా?**

**-వెన్నెముక లేనివారు మన గొంతులను వినిపిస్తే, దక్షిణాది గొంతు ఎప్పటికీ వినిపించదు**

**- పవన్‌కి గట్టి కౌంటర్ ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి**

హైదరాబాద్ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రస్తుతం దేశవ్యాప్తంగా హిందీ భాష వివాదం నడుస్తుంటే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హిందీకి మద్దతుగా నిలుస్తున్న విషయం తెలిసిందే. ఒకప్పుడు హిందీ భాషను బలవంతంగా రుద్దుతున్నారంటూ వ్యాఖ్యలు చేసిన పవన్ ఇప్పుడు హిందీని అందరం నేర్చుకోవాలని ఢిల్లీ పెద్దల ముందు గులాంగా మారాడు. అయితే ఇటీవల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హిందీ భాష గురించి మాట్లాడుతూ.. హిందీ ఇంపోజిషన్‌ను వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. ఉర్దూ మిక్స్ తెలుగు ఉండే తెలంగాణ లీడర్లు సైతం హిందీని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడం లేదంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్ ఇచ్చాడు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పవన్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. కొంతమందికి ఎప్పుడు అర్థమవుతుంది?! హిందీని రుద్దడం కేవలం భాష గురించే కాదని. ఇది ఉత్తర(ఆర్యులు) భారతదేశంకి చెందిన వారు దక్షిణ (ద్రావిడ) భారతదేశంపై తమ ఆధిపత్యాన్ని చెలాయించడమే. వారు తాము ఉన్నతమైనవారమని, మనం తక్కువవారమని చూపించడానికి ప్రయత్నిస్తున్నారు. నాకు హిందీ/ఉర్దూ (రెండు ఒకటే) చాలా బాగా వచ్చు, మరి ఉత్తరాదిలో నివసించే ఎవరైనా తెలుగులో మాట్లాడతారా? వెన్నెముక లేనివారు మన గొంతులను వినిపిస్తే, దక్షిణాది గొంతు ఎప్పటికీ వినిపించదంటూ పవన్‌కి గట్టి కౌంటర్ ఇచ్చాడు.

# దుబాయ్‌ను చూస్తుంటే తనకు అసూయ వేస్తుంది

**-50 డిగ్రీల టెంపరేచర్ ఉన్నప్పటికీ ఎడారి నుంచి స్వర్గాన్ని సృష్టించిన దేశం దుబాయ్**

**-వారు ఇంటర్నెట్ సిటీ పెడితే.. తాను హైటెక్ సిటీ కట్టాను**

**-సీఎం చంద్రబాబు నాయుడు**

విజయవాడ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దుబాయ్‌ను చూస్తుంటే తనకు అసూయ వేస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 50 డిగ్రీల టెంపరేచర్ ఉన్నప్పటికీ ఎడారి నుంచి స్వర్గాన్ని సృష్టించిన దేశం దుబాయ్ అని తెలిపారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్ సమ్మిట్‌కు చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. దుబాయ్‌లో ఎడారి ప్రాంతాలు, బీచ్‌లు పర్యాటకులకు ఆహ్లాదకర అనుభూతిని కలిగిస్తాయని అన్నారు. దుబాయ్ అభివృద్ధిని తాను చూశానని.. వారు ఇంటర్నెట్ సిటీ పెడితే.. తాను హైటెక్ సిటీ కట్టానని చంద్రబాబు గుర్తుచేశారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుంటేనే అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. విభిన్నంగా ఆలోచించడం వల్లే కొత్త ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని తెలిపారు. 2021లో మనం కరోనా వల్ల భయపడ్డామని.. ఆ సమయంలో యూఏఈ ఇన్వెస్టోపియాను తీసుకొచ్చారని తెలిపారు. యూఏఈతో భారత్‌కు మంచి సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. 1.1 కోట్ల మంది యూఏఈ జనాభాలో 40 శాతం మంది భారతీయులే ఉన్నారని తెలిపారు. వారి ద్వారా కూడా అక్కడ అభివృద్ధి జరుగుతుందని, మన వాళ్లకు అవకాశాలను వస్తున్నాయని అన్నారు. వ్యాపారపరంగా భారతదేశాన్ని ఎవరూ విస్మరించలేరని ఆయన అన్నారు. 1991లో ఆర్థిక సంస్కరణలు, 1995లో టెక్నాలజీ రివల్యూషన్‌తో పరిస్థితి మారిందని చంద్రబాబు తెలిపారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారత్‌కు అపార అవకాశాలు వచ్చాయని పేర్కొన్నారు. వికసిత్ భారత్ ద్వారా 2047 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2026 జనవరి నాటికి క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 575 సేవలు అందిస్తున్నామని.. ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండదని అన్నారు. ఆగస్టు 15 నాటికి అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

# ఉచిత బస్సుప్రయాణ ఆడబిడ్డలకు ఆర్థిక భారం తగ్గించి ఆరోగ్య రక్షణకు ఆసరాగా నిలిచింది

**-కొందరు ఎగతాళి చేసినా కూడా ఆర్ టీసిలో ఉచిత ప్రయాణ పథకం కొనసాగిస్తున్నం**

**-ట్విట్టర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఒక సంక్షేమ పథకం అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం తన ట్విట్టర్ లో రేవంత్ పోస్టు చేశారు. కొందరు ఎగతాళి చేసినా కూడా ఆర్ టిసిలో ఉచిత ప్రయాణ పథకం కొనసాగించామని, ఆడబిడ్డలకు ఆర్థిక భారం తగ్గించి ఆరోగ్య రక్షణకు ఆసరాగా నిలిచిందని ప్రశంసించారు. ఆనందకర జీవితానికి ఆలంబన అవ్వడంతో పాటు ఈ ఒక్క పథకం వల్ల ఆర్ టిసిలో ఆడబిడ్డల ఆక్యుపెన్సీ 35 నుండి 60 శాతానికి పెరిగిందని కొనియాడారు. పేద ఆడబిడ్డలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల చికిత్స కోసం ఆసుపత్రులకు వచ్చే సంఖ్య 31 శాతం పెరగడంతో ఆర్టిసి సంస్థ గట్టెక్కిందన్నారు.అదే ఆర్టిసిలో పని చేస్తున్న ఈ చెల్లెమ్మలు చెప్పిన వివరాలు తనకు ఎనలేని సంతోషాన్ని కలిగించాయని రేవంత్ వివరించారు. ప్రజా పాలన ప్రారంభమయ్యే నాటికి ఇక ఆర్ టిసి కథ కంచికే అన్న పరిస్థితి ఉందని, కానీ ఇప్పుడు పేదవాడి ప్రగతి రథ చక్రం ఇక చరిత్ర పుటల్లోకి ఎక్కిందని మెచ్చుకున్నారు. జారి పోతుందనే పరిస్థితి నుండి మొదలై.. నేడు 200 కోట్ల జీరో టికెట్లతో రికార్డు సృష్టించిందన్నారు. ఆడబిడ్డలకు సాయం చేయడంతో పాటు ఆర్ టిసి ప్రాణం పోసిన ప్రతి ఉద్యోగి, సిబ్బంది, కార్మికులకు రేవంత్ శుభాకాంక్ష

# భారీగా నృసింహుని హుండీ ఆదాయం

**-రూ.2,45,48,023 కోట్ల నగదుతో పాటు ,బంగారం,వెండి, విదేశీ కరెన్సీ**

యాదగిరిగుట్ట, జూలై 23 (ఎక్స ప్రెస్ న్యూ స్);: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి 41 రోజుల హుండీలను బుధవారం లెక్కించారు . 38 గ్రాముల మిశ్రమ బంగారం, రెండు కిలోల 800గ్రాముల మిశ్రమ వెండి తో పాటు 2,45,48,023 ( రెండు కోట్ల నలభై ఐదు లక్షల నలభై ఎనిమిది వేల ఇరవై మూడు రూపాయలు) నగదు ఆదాయం హుండీల ద్వారా సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ కరెన్సీ కూడా సమకూరినట్లు ఆయన వివరించారు.అమెరికా-1036 డాలర్లు, ఆస్ట్రేలియా -5 డాలర్లు, ఇంగ్లాండ్-45 పౌండ్స్, సౌదీ అరేబియన్ -5 రియల్, సింగపూర్-10 డాలర్స్ , కతర్-1/2రియల్, ఒమన్ - 500 బైస ,అరబ్ ఎమిరేట్స్-70 ధీర మ్స్, శ్రీలంక - 500.,మలేసియా - 23, రింగిట్స్,కెనడా-20 డాలర్స్, బెహ్రిన్ - 2 . హుండీ లెక్కింపులో అనువంశిక ధర్మకర్త బి నరసింహమూర్తి కూడా పాల్గొన్నారు.

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై విచారణను ఆగస్టు 13వ తేదీకి వాయిదా

న్యూ ఢిల్లీ (హైదరాబాద్ ) జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేసింది. భూముల వ్యవహారంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ చర్యలపై ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. అయితే, ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌పై సమాధానం ఇచ్చేందుకు అమికస్ క్యూరీ సమయం కోరారు. దాంతో కేసు విచారణ ఆగస్టు 13వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.ఈ మేరకు విచారణను ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేసింది.సుప్రీంకోర్టు ఆదేశాలతో చర్యలు తీసుకున్నట్లుగా ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో విచారణ సందర్భంగా ప్రస్తుతం స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ మొత్తానికి ఫారెస్ట్‌ను సంరక్షించారు కదా? అంటూ ప్రశ్నించారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనకుందన్నారు. స్థిరమైన అభివృద్ధి ముఖ్యమే అయినప్పటికీ.. బుల్డోజర్లతో అడవులను రాత్రికి రాత్రే నాశనం చేయవచ్చని అర్థం కాదని సీజేఐ అన్నారు.

# ఈనెల 27వ తేదీ నుంచి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ను ప్రారంభం

హైదరాబాద్ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ను ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సంస్మరిస్తూ .. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌కు చెందిన 8వ ఎడిషన్‌ను ఆర్గనైజ్ చేస్తున్నారు. తెలంగాణను హరిత ప్రదేశంగా మార్చేందుకు విజినరీ నేత, తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్ ఆకాంక్షించారని, ఆయన నేతృత్వంలోనే తెలంగాణ హరితంగా మారిందని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రేరణతో లక్షలాది మంది రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటారు. మొక్కలు నాటడం, వాటి సంరక్షణ, కాపాడుకోవాలన్న ఉద్దేశంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను నిర్వహిస్తున్నారు. మాజీ రాజ్యసభ ఎంపీ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా ఉద్యమం జోరుగా సాగుతున్నది. అయితే మాజీ సీఎం కేసీఆర్ విజన్‌ను ముందుకు తీసుకెళ్లాలని, స్వచ్ఛమైన.. హరితమైన.. ఉత్తమ రేపటిని తీర్చిదిద్దేందుకు చేతులు కలపాలని సంతోష్‌కుమార్ తన ట్వీట్‌లో తెలిపారు. మార్పు కోసం మొక్కను నాటాలని, ఆ మార్పులో భాగస్వామ్యం కావాలని ఆయన తన ఎక్స్ అకౌంట్ ద్వారా పిలుపునిచ్చారు.

# 309 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు

హైదరాబాద్, జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో 33 స్పెషాలిటీ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 309 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ప్రభుత్వం జీఓలు జారీ చేసింది. ఈ క్రమంలో త్వరలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు లభించనున్నాయి. సర్కార్ ఇటీవలే 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుంది. మరో 714 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. మెడికల్ కాలేజీల అభివృద్ధి, ఫ్యాకల్టీ కొరతను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నేషనల్ మెడికల్ కమిషన్ ఇటీవల ప్రశంసించింది. ఒక్క సీటుకు కూడా కోత పెట్టకుండా, ఒక్క రూపాయి జరిమానా విధించకుండా అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుమతులు కొనసాగిస్తున్నట్టు ఎన్ఎంసీ వెల్లడించింది.

# ఎపి మద్యం కుంభకోణం వెనుక కుట్రలు పూర్తిగా వెలికి తీయాలి

**-ఎపిసిసి చీఫ్ షర్మిల డిమాండ్**

అమరావతి జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఎపి మద్యం కుంభకోణం వెనుక కుట్రలు పూర్తిగా వెలికి తీయాలని ఎపిసిసి చీఫ్ షర్మిల తెలిపారు. ఎపి లిక్కర్ స్కామ్ చాలా పెద్దది అని అన్నారు. కుంభకోణం ఓ ఆర్థిక నేరమని విమర్శించారు. మద్యం కుంభకోణంపై వైఎస్ షర్మిల స్పందించారు. ఈ సందర్భంగా గన్నవరం విమానాశ్రయంలో మీడియాతో షర్మిల మాట్లాడుతూ..ఎక్కడా లేని విధంగా గత వైసిపి ప్రభుత్వం ఆర్థిక నేరానికి పాల్పడిందని, ఎపి లిక్కర్ స్కామ్ పై సమగ్ర విచారణ జరపాలని అధికారులకు సూచించారు. వైసిపి మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో వాస్తవాలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దాచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.క్యాష్ లెస్ మద్యం అమ్మకాలను గత ఐదేళ్లు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. బ్లాక్ మనీ కోసమే డిజిటల్ పేమెంట్ నిలిపివేశారని మండిపడ్డారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు సూటిగా సమాధానం చెప్పాలి అని ఒక్క రూ. 3,500 కోట్లే మద్యం స్కామ్ కాదని, పన్నులు ఎగ్గొట్టాలనే నగదుతోనే అమ్మకాలు చేశారని ధ్వజమెత్తారు. డిజిటల్ పేమెంట్ ఆపడం వెనుక అవినీతి దాగి ఉంది అని అనుమానం వ్యక్తం చేశారు. ఎపి లిక్కర్ స్కామ్ పై జగన్ సమాధానం చెప్పాలి అని షర్మిల డిమాండ్ చేశారు.

# మక్తల్ శాసనసభ నియోజకవర్గం నుంచి బిజెపిలో పెద్దఎత్తున చేరికలు

**-కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోంది**

**-రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి పాటుపడాలి**

**-బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపు**



హైదరాబాద్ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ శాసనసభ నియోజకవర్గం నుంచి వివిధ పార్టీలకు చెందినా నాయకులు బిజెపిలో పెద్దఎత్తున చేరారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానం తెలిపారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి పాటుపడాలి. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోంది. యూపీఏ హయాంలో యూరియా కోసం రైతులు బారులు తీరిన క్యూలైన్లలో గొడవలు జరిగి, లాఠీచార్జీలు జరిగిన అనేక ఘటనలు చూశాం. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూరియా కొరత లేకుండా, ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతోంది. అయినా ఇటీవల బిజెపిని బద్నాం చేయడానికి కొన్ని శక్తులు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నాయి. రబీ సీజన్ కోసం తెలంగాణకు అవసరమైన యూరియా 9.5 లక్షల మెట్రిక్ టన్నులు. కేంద్రం సరఫరా చేసిన యూరియా: 12.02 లక్షల మెట్రిక్ టన్నులు. ఇది అవసరానికి మించి 2.5 లక్షల టన్నుల అదనపు సరఫరా. అయినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో కొన్ని ఫెర్టిలైజర్ షాపుల ముందు రైతులు బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే. కేంద్రం పంపిన ఎరువులను రాష్ట్రంలోని కొంతమంది బ్లాక్ మార్కెట్‌కి మళ్లిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే. కృత్రిమ కొరత, బ్లాక్ మార్కెట్, ఎరువుల డీలర్లపై సరైన మానిటరింగ్ లేకపోవడం, సరఫరా వ్యవస్థపై రాష్ట్ర వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం.. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వ పాలనావరమైన వైఫల్యానికి నిదర్శనం. యూరియా బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. తెలంగాణ రాష్ట్రానికి ఎంత మేర అవసరమో అంత మేర యూరియా ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉంది. అయినా రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాల ప్రచారంతో రైతుల్లో అపోహలు సృష్టిస్తోంది. మహబూబ్ నగర్ జిల్లాలోని మక్తల్ వంటి ప్రాంతం కాటన్ సీడ్ బౌల్‌గా పేరుగాంచింది. అలాంటి ప్రాంతాల్లో కూడా కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఫెర్టిలైజర్ షాపులతో కుమ్మక్కై బ్లాక్ వ్యాపారానికి పాల్పడుతున్నారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో బిజెపి నాయకులు, కార్యకర్తలు.. వార్డు మెంబర్ స్థాయి నుంచి జడ్పీటీసీ స్థాయివరకు సిద్ధంగా ఉండాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బిజెపి డిమాండ్ చేస్తోంది. అయినా దానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని బిజెపిపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటు. బిజెపిపై తప్పుడు ప్రచారం చేయడమే కాంగ్రెస్ నాయకుల ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలో బిజెపి కి మంచి వాతావరణం ఉంది. కాబట్టి నాయకులు, కార్యకర్తలు మధ్య ఎలాంటి మనస్పర్థలు లేకుండా కలిసిమెలిసి పని చేసి బిజెపిని గెలిపించాలి. బిజెపి మనకు తల్లిలాంటి పార్టీ. అలాంటి పార్టీకి ఎవరూ కూడా ద్రోహం చేయరాదు. మహబూబ్ నగర్ ఎంపీ స్థానంతో పాటు మున్సిపాలిటీలు, నారాయణపేట మున్సిపాలిటీ, మక్తల్ చైర్మన్ స్థాయిలలో బిజెపి విజయాలు సాధించింది. రానున్న రోజుల్లో బిజెపి రాష్ట్రంలో మరింత బలమైన వాతావరణం ఉంది. అందుకే కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారంతో ప్రజలను మభ్యపెడుతోంది. గతంలో నేను ఎమ్మెల్సీగా రాష్ట్రవ్యాప్తంగా సేవలందించాను. ఆ సమయంలో మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజలు నాపై విశేష ఆదరణ చూపారు. రేపు (జూలై 24) మహబూబ్ నగర్ జిల్లాలో నా పర్యటనలో భాగంగా బిజెపి శ్రేణులంతా ఐక్యతను ప్రదర్శించి ప్రజల్లో మరింత విశ్వాసం పెంచాలి. కొత్తవారు, పాతవారు అనే భేదం లేకుండా నాయకులు, కార్యకర్తలు అందరూ కలసికట్టుగా పని చేసి బిజెపి ని అధికారంలోకి తీసుకురావడంలో కృషి చేయాలి.

# బోయిన్ పల్లి వ్యవసాయ మార్కెట్‌ను రైతు కమిషన్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు

హైదరాబాద్ జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సికింద్రాబాద్ లోని బోయిన్ పల్లి వ్యవసాయ మార్కెట్ ను రైతు కమిషన్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. బుధవారం ఉదయం 6 గంటలకే బోయిన్ పల్లి మార్కెట్ కు కమిషన్ బృందం చేరుకొని దాదాపు గంటన్నర వరకు మార్కెట్ లో పర్యటించి అక్కడి సమస్యలు, అధికారుల నిర్లక్ష్యాన్ని గుర్తించారు. వివిధ రాష్ట్రాల నుండి బోయిన్ పల్లి మార్కెట్ కు వచ్చిన రైతులు, వ్యాపారులతో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, భవానీ రెడ్డి మాట్లాడారు. గత నాలుగు రోజులుగా మార్కెట్ సెక్రెటరీ అందుబాటులో లేకపోవడంతో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. బోయిన్ పల్లి మార్కెట్ లో రైతుల నుండి కొనుగోళ్లు, అమ్మకాల పై ఆరా తీశారు. అధికారుల చాంబర్లు, రసీదులు, అటెండెన్స్ రిజిస్టర్, రికార్డులను చెక్ చేశారు. బోయిన్ పల్లి మార్కెట్ లో అమ్మకాలు కొనుగోళ్లకు సంబంధించిన డేటాను సేకరించారు. అదే విధంగా కూరగాలయ వ్యర్థాలు ద్వారా బయో గ్యాస్ ప్లాంట్ ను పరిశీలించాడు. ప్లాంట్ పనిచేయడం లేదని తెలుసుకొని మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. బోయిన్ పల్లి మార్కెట్ కు పక్క రాష్ట్ర ల కూరగాయాలు వస్తున్నాయి చెన్నై, నెల్లూరు, యుపి, ఎంపి, మహారాష్ట్రాల నుంచి వస్తున్నట్లు తెలుసుకున్నారు. బోయిన్ పల్లి మార్కెట్ ను పరిశీలించిన బృందంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, భవానీ రెడ్డి, కమిషన్ అధికారులు హరి వెంకట ప్రసాద్, మహేష్ తదితరులు వున్నారు

# అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలి

**-అధికారులకు సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశం**

అమరావతి జూలై 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిఎం అధికారులకు సూచించారు. సిఎం చంద్రబాబుతో క్యూపిఐఎఐ సంస్థ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజన్ సమావేశం అయ్యారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం వ్యాలీలోక్యూపిఐఎఐ సంస్థ భాగస్వామ్యం అయ్యారు. విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని అధికారులకు సిఎం ఆదేశాలిచ్చారు. అధునాతన 8 క్యూబినేట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఎఐ సంస్థ ముందుకొచ్చిందని చంద్రబాబు తెలియజేశారు.



